





తాండూరు ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వికారాబాద్‌లోని ఆలంపల్లి ఈద్గా వద్ద..

భక్తిశ్రద్ధలతో బక్రీద్

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం ఉదయాన్నే కొత్త బట్టలు ధరించి మజీద్‌లు, ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మత గురువులు బక్రీద్ పర్వదిన విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అధికారులు, ప్రముఖులు ప్రార్థనా స్థలాల వద్దకు చేరుకొని ముస్లింలకు ఈద్ ముబారక్ తెలిపారు. బక్రీద్ నేపథ్యంలో గొర్లు, మేకలను ఖుర్బానీ చేసి బంధుమిత్రులకు పంచిపెట్టారు.



అనంతగిరిలో పర్యాటకుల సందడి

అనంతగిరికి పర్యాటకుల తాకిడి

వికారాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వరుసగా సెలవుల నేపథ్యంలో అనంతగిరికి పర్యాటకులు తాకిడి నెలకొంది. అనంతగిరి ఆలయం, పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ సందడి చేస్తున్నారు. నందిఘాట్ సమీపంలోని ట్రెక్కింగ్, వ్యూ పాయింట్‌లను సందర్శించి ఆనందంగా గడిపారు. కాగా, అనంతగిరి అర్బన్ పార్కులో నందిఘాట్ సమీపంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో పర్యాటకులు సేద తీరేందుకు నిర్మాణాలు ఉపయోగ పడుతున్నాయి.



సమ్మర్ క్యాంపులో విద్యార్థులతో అధికారులు

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి గోపాల్‌రావు

మేడ్చల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగిసినట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి గోపాల్‌రావు తెలిపారు. మే 1 నుంచి జూన్ 6 వరకు జిల్లాలోని నాగారంలో సమ్మర్ క్యాంపు అథ్లెటిక్ కోచింగ్ ఏర్పాటు చేశారు. ఇందులో 10 మంది బాలికలు, 19 మంది బాలురకు శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అథ్లెటిక్స్ కోచ్ తిరుమలరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని, క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. వేసవిలో విద్యార్థులకు శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, పీడీ మనోహర్, పీఈటీ భద్రం, భాస్కర్ చౌదరి , ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బెర్త్ దొరికేనా?

మంత్రివర్గ విస్తరణపై ఉమ్మడి జిల్లా నేతల ఆశలు

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ దాదాపు ఖరారుకావడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరు సీనియర్లు అమాత్య పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కొద్ది రోజులుగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరదించుతూ కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న కొందరు నేతలు ఢిల్లీకి వెళ్లి మరీ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి రేస్‌లో మల్‌రెడ్డి, టీఆర్‌ఆర్ ఉండగా, అనూహ్యంగా శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ పేరు తెరపైకి రావడం గమనార్హం.

- అనూహ్యంగా తెరపైకి స్పీకర్ ప్రసాద్‌కుమార్ పేరు
- రేస్‌లో మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి!
- జాబితాపై కొనసాగుతున్న సస్పెన్స్!
- నేడు ప్రకటన రానున్నట్లు విస్తృత ప్రచారం





(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదిన్నరదాటినా ఇప్పటి వరకు పూర్తి స్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయని విషయం తెలిసిందే. రాష్ట్ర మంత్రివర్గంలో మరో ఆరు బెర్త్‌లు ఇంకా ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీ విషయంలో అదిగో ఇదిగో అంటూ ఆశావహులను ఊరిస్తూ వచ్చిన అధిష్ఠానం ఎట్టకేలకు మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సామాజిక వర్గాల సమతూకం పాటిస్తూ మంత్రివర్గ విస్తరణ చేపటాలని ఆదేశించింది. ఇదిలా ఉంటే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి మంత్రివర్గంలో

మిగతా 7వ పేజీలో...

2008 డీఎస్సీ వారికి
వేతనాలివ్వాలి

బొంరాస్‌పేట్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): 2008 డీఎస్సీ వారికి వేతనాలు అందించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే బడిబాట కార్యక్రమం ముగింపు తర్వాతే జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలన్నారు. 2024 నవంబర్ నెలలో కుల గణన సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్స్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గౌరారం గోపాల్, ఎండీ.అలీముద్దీన్ మాట్లాడుతూ విద్యార్థుల నమోదు పెంచాలని చెబుతూ ఉపాధ్యాయులు ఎక్కువ మంది ఉన్నారనే కారణంగా సర్దుబాటు ఈ నెల 13 వరకు ముగించాలని ఉత్తర్వులు జారీ చేయడం సరైంది కాదన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేస్తే బాగుంటుందన్నారు.

నేడు సాయిగీతా ఆశ్రమంలో
ఉచిత వైద్య శిబిరం

మేడ్చల్ టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపల్ కండ్లకోయ పరిధి దేవరయాంజాల్ రోడ్డులోని సాయిగీతా ఆశ్రమంలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మృగశిర కార్తెను పురస్కరించుకుని నేడు ఆశ్రమంలో ఆస్తమా, శ్వాస సంబంధిత సమస్యలున్న వారికి ప్రత్యేక మందును అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం ప్రారంభమౌతుందన్నారు. అవసరమైన వ్యాధిగ్రస్తులు సకాలంలో వైద్య శిబిరానికి హాజరై సద్వినియోగం చేసుకోవాలని ఆశ్రమ నిర్వాహకులు కోరారు.



అసంపూర్తిగా వదిలేసిన కల్వర్టు నిర్మాణ పనులు

హైవే పనులకు బ్రేక్!

- ఏడాదిగా కొనసాగని పనులు
- తాండూరు - కొత్లాపూర్ మధ్య నత్తనడకన
- ప్రమాదకరంగా మారిన కల్వర్టుల నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

తాండూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే వచ్చిందని తాండూరు ప్రాంత ప్రజలు సంబరపడిపోయారు. ఇప్పుడు పనులు ముందుకు సాగక పడరానిపాట్లు పడుతున్నారు. కర్ణాటక చించోళి నుంచి తాండూరు మీదుగా మహబూబ్‌నగర్ వరకు నిర్మిస్తున్న రహదారిని ఎన్‌హెచ్ 167గా గుర్తించారు. ఈ రోడ్డు తాండూరు పరిధిలో 30 కిమీ ఉంటుంది. ఈ రోడ్డు కర్ణాటక, మహారాష్ట్రకు లింకు హైవే. ఏడాది క్రితం తాండూరు - చించోళి, తాండూరు - కొడంగల్ మధ్య పనులు ప్రారంభించారు. దీని కోసం రూ.35 కోట్లు మంజూరయ్యాయి. కొంత మేర కంకర, మట్టి పోసి వదిలేశారు. ఇంకొంత దూరం ఎగుడు, దిగుడుగా చేసి సరిపెట్టారు. దీంతో వర్షం పడితే ఈ రోడ్డు బురదమయమై వాహనాలు దిగబడిపోతున్నాయి.

అసంపూర్తి పనులతో అవస్థలు

రాష్ట్ర సరిహద్దు వరకు తాండూరు - కొత్లాపూర్ మధ్యన 13 కిలో మీటర్ల రహదారి. ఈ రోడ్డును జాతీయ రహదారి కింద గుర్తించారు. ఈ రోడ్డు టెండర్ ప్రక్రియ మాత్రం చించోళి నుంచి తాండూరు శివారు వరకు దాదాపు 40 కిలో మీటర్లు ఉంటుంది. కాంట్రాక్టర్ ఈ రోడ్డు పనులను

మిగతా 8వ పేజీలో...

బొమ్మను చేసి.. ప్రాణం పోసి



ఆధునికతను అందిపుచ్చుకుని విగ్రహాల తయారీ

స్వయం ఉపాధిలో రాణిస్తున్న కస్తూర్‌పల్లి వాసి


గుండప్ప శిల్పకళ నైపుణ్యంపై ప్రత్యేక కథనం

7

శిల్పకళలో ఎలాంటి శిక్షణ పొందలేదు. కులవృత్తి నేపథ్యంతో మట్టితో కుండలను తయారు చేయడంతో పాటు విగ్రహాలను తయారు చేయడం నేర్చుకున్నాడు. అనంతరం ఆధునికతను అందిపుచ్చుకొని సిమెంట్, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ (తెల్ల సున్నం)తో అందమైన విగ్రహాలు తయారు చేస్తూ ఔరా! అనిపిస్తున్నాడు. స్వయం ఉపాధితో ఆదరణ పొందుతున్నాడు. కొడంగల్ మండలంలోని కస్తూర్‌పల్లికి చెందిన కె.గుండప్ప శిల్పకళ నైపుణ్యంపై ప్రత్యేక కథనం. -కొడంగల్ రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి)

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు
539 మంది ఎంపిక


ఎన్‌ఎంఎంఎస్‌లో సత్తా చాటిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు



వికారాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) అర్హత పరీక్షలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా విద్యార్థులు సత్తా చాటుకున్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏటా ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తున్న విషయం తెలిసిందే. 2024-25 విద్యా సంవత్సరానికి నవంబరులో ఈ పరీక్ష నిర్వహించగా, ఇటీవల ఫలితాలను ప్రకటించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో 539 మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. అత్యధికంగా రంగారెడ్డి జిల్లా నుంచి 285 మంది, మేడ్చల్ నుంచి 194 మంది, వికారాబాద్ జిల్లా నుంచి 60 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గ్రామీణ ప్రాంతమైన వికారాబాద్ జిల్లాలో దోమ మండలం, దాదాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి అయిదుగురు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ఆ పాఠశాల జీహెచ్‌ఎం దోమ అమర్‌నాథ్, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఏటా రూ.12 వేల ఉపకార వేతనం

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులకు ఏటా రూ.12 వేలు ఉపకార వేతనం అందించనున్నారు. ఒక్కొక్కరికీ 9, 10, ఇంటర్ ఫస్టియర్, సెకెండియర్ వరకు నాలుగేళ్ల పాటు రూ.48 వేలు ఉపకార వేతన రూపంలో కేంద్ర ప్రభుత్వం అందించనుంది. ఎంపికైన విద్యార్థులు నాలుగేళ్లలో రూ.2,58,72,000 ఉపకార వేతనం అందుకోనున్నారు











రోడ్డిలా.. ప్రయాణమెలా?


బషీరాబాద్ పంచాయతీ సమీపంలో భారీ గుంతలు పడిన బీటీ రోడ్డు

బషీరాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం గ్రామ పంచాయతీ సమీపంలోని ప్రధాన బీటీ రోడ్డు గుంతలమయమైంది. కొన్నేళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో గుంతలతో రోడ్డు అధ్వానంగా మారింది. వర్షాలు పడుతుండటంతో గుంతల్లో నీరునిలిచి చిత్తడిగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో గుంతలు ఎంత లోతు ఉన్నాయో తెలియక ద్విచక్ర వా హనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇదిలా ఉంటే.. ఈ రోడ్డుకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుపై గుంతల పూడ్చివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


బడిబాటలో ఉపాధ్యాయులతో ఎంఈవో విజయరామారావు

దుద్యాల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈవో విజయరామారావు అన్నారు. బడిబాటలో భాగంగా శనివారం దుద్యాల ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చందర్‌నాయక్, రవీందర్‌గౌడ్, మల్లప్ప, విజయ్‌కుమార్, రమేశ్ యాదవ్, శ్రీనివాసులు, రాములు పాల్గొన్నారు.

దోమ: బడి బయట ఉన్న పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జీహెచ్ఎం అమర్‌నాథ్ అన్నారు. బడిబాటలో భాగంగా దాదాపూర్‌లో టీచర్లతో కలిసి అవగాహన కల్పించారు.

పరిగి: బడిబయట ఉన్న పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో గోపాల్ కోరారు. పరిగి మండలం నస్కల్‌లో జడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి విద్యార్థులను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు జ్యోతి, పరమేశ్వరి, మహేశ్ అన్నారు. బడిబాటలో భాగంగా శనివారం ఎన్కెపల్లిలో ఉపాధ్యాయులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.


పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జీహెచ్ఎం అమర్‌నాథ్

విష ప్రచారానికి ఒడిగట్టిన బీఆర్ఎస్


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, బిక్య, బిచ్యా

కడ్తాల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ నేతలు పథకాలు, ప్రాజెక్టుల పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్నారని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై నోటీసులిస్తేనే కేసీఆర్‌తో సహా అవినీతిలో భాగస్వాములంతా వణుకుతున్నారని, విచారణ పూర్తయితేనే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయన్నారు. శనివారం కడ్తాలలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సంపద కొల్లగొట్టిన వారిని కాంగ్రెస్ ప్ర భుత్వం ఉపేక్షించదన్నారు. కేసీఆర్ కుటుంబ పాలనతో తెలంగాణ అప్పులపాలైందని ఆరోపించారు. అవినీతిని వెలికి తీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషప్రచారానికి తెరతీశారన్నారు. అధికారానికి దూరమైన వారు ఓర్వలేక ప్రగతి నిరోధకులుగా మారారన్నారు. ప్రభుత్వం నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోం దన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ జగన్, తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి హేయమైన చర్య


విలేకరులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం బెల్కటూర్ గ్రామానికి చెందిన దళిత యువకుడు వినయ్‌కుమార్ మే 18న పెళ్లి బరాత్‌లో కొందరు అగ్రకులస్తులు దాడికి పాల్పడటం హేయమైన చర్య అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. వారు శనివారం కొడంగల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. దళితులపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగి 12రోజులు గడుస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుంటే రేపు(సోమవారం) తాండూరు డీఎస్పీ కార్యాలయం ముందు ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కొత్తూర్ చంద్రయ్య, రమేశ్‌బాబు, శ్రీనివాస్, నర్సిములు, శ్రీనివాస్, లాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఈత, తాటి చెట్లను నరికితే చర్యలు


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్

ఆమనగల్లు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఈత, తాటి చెట్లను నరికితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ హెచ్చరించారు. ఈ చెట్లతో గౌడ కులస్థులు, గీత కార్మికులు ఉపాధి పొందుతున్నారన్నారు. శనివారం ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో ఈత, తాటి చెట్లను తొలగించాలంటే ఎక్సైజ్ శాఖ అనుమతి తీసుకోవాలన్నారు. కలెక్టర్ అనుమతి తర్వాత ఒక్కో చెట్టుకు రూ.1,968 చెల్లించాలని, తొలగించిన చెట్ల స్థానంలో మరోచోట మొక్కను నాటాలని తెలిపారు. ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బూత్‌స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బోసుపల్లి ప్రతాప్

ఆదిబట్ల, జూన్ 7(ఆంధ్రజ్యోతి):బీజేపీని బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. శనివారం ఆదిబట్లలో ఓ గార్డెన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 11 సంవత్సరాల నుంచి మోదీ పాలనను, కేంద్ర పథకాలపై బూత్‌స్థాయిల్లో ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన సరిగా లేదన్నారు. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు కార్యకర్తలు మొక్కలు నాటాలని ఆయన సూచిం చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ పొట్టి రాములు, పార్టీ నాయకులు లక్ష్మీపతి, అశోక్‌గౌడ్, కొరె శివ, యాదయ్య, శ్రీదేవి, భాస్కర్ పాల్గొన్నారు.

మునిసిపాలిటీలో అక్రమాలను అరికట్టాలి

తాండూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ సంగీతఠాగూర్ డిమాండ్ చేశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'పనిచేయకుండా వేతనాలు' అనే శీర్షికన ప్రచురితమైన వార్త పై ఆమె స్పందించారు. మునిసిపాలిటీలో ఇదొక్కటే కాదని, ఎన్నో అ క్రమాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. లంచాలకు మరిగి ప్రజలను పీడిస్తున్నా ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మాంసపు వ్యర్థాల టెండర్‌లో అక్రమం జరిగిందని, మున్సిపల్ జేపీ విషయంలోనూ అక్రమాలు జరిగాయని, ఎంతో మంది మ్యుటేషన్లకు దరఖాస్తు చేసుకున్నా పనిచేయడం లేదన్నారు. అడిగేవారు ఎవరూ లేరనే లంచావతారమెత్తారని అన్నారు. బల్దియాలో జరుగుతున్న అక్రమాలపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టిపె ట్టాలని, మునిసిపాలిటీని ప్రక్షాళన చేయాలని ఆమె కోరారు.

అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

దౌల్తాబాద్, జూన్7(ఆంధ్రజ్యోతి):దౌల్తాబాద్ కో-ఆపరేటివ్ బ్యాంకులో 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో లావణ్య శనివారం పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత ఏఈవోను సంప్రదించి పర్మిట్ జనరేట్ చేసుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు. 40కిలోల బస్తా సబ్సిడీపై రూ.2,510కు ఒక్కో రైతుకు ఒక బస్తా మాత్రమే ఇవ్వనున్నట్లు తెలిపారు.







ఆలయంలో పూజలు చేస్తున్న సునీతారెడ్డి

బుగ్గలింగేశ్వరాలయంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ పూజలు

బషీరాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మర్పల్లిలోని బుగ్గలింగేశ్వరాలయాన్ని వికారాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి శుక్రవారం రాత్రి దర్శించుకొని పూజలు చేశారు. పురాతన ఆలయాన్ని తీర్చిదిద్దేందుకు సునీతారెడ్డి ముందుకు వచ్చారు. ఈ ఆలయ పునర్నిర్మాణానికి ఆమె సొంతంగా డబ్బు వెచ్చించారు. ఆలయాన్ని ప్రత్యేక శిలలతో నిర్మించారు. శివలింగాన్ని ప్రతిష్ఠించి నిర్వహించిన పూజలకు సునీతారెడ్డి హాజరయ్యారు. అంతకు ముందు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బుగ్గలింగేశ్వర, చెన్నకేశవాలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్లు అజయ్‌ప్రసాద్, చందర్‌నాయక్, న్యాయవాది మనోహర్‌రావు, కాంగ్రెస్ జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు బి.శంకరప్ప, నాయకులు కలాల్ నర్సింహులుగౌడ్, పరిమళ, నర్సిరెడ్డి, వాల్మీకి నరేష్, జి.నీలమ్మ, బంటురాజు, పి.చంద్రరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న భక్తులు

మంచాల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధి బోడకొండ బంజారా మ్యారామయాడి ఆలయ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మూడు రోజులు జరిగే ఉత్సవాల్లో భాగంగా శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించారు. దుర్గంచెర్వు కలెక్టివ్ ఎల్ఎల్‌పీ సంస్థ ఈ ధ్వజస్తంభాన్ని బహూకరించింది. దుర్గంచెర్వు సంస్థ ప్రతినిధి జగదీశ్ మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్మదలచ్చీరాం, మాజీ సర్పంచ్ కస్నానాయక్, బద్రీనాథ్‌గుప్తా, శివభావోజీ, బాలాజీ, ధర్మ, సోమ్లా, పాండు, బాలునాయక్, బిచ్యా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి రథోత్సవం



రథోత్సవంలో అయ్యప్ప స్వాములు, గ్రామస్తులు

శంకర్‌పల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. విఠలేశ్వరాలయం నుంచి అయ్యప్ప ఆలయం వరకు భజనల మధ్య విగ్రహ ఊరేగింపు చేపట్టారు. ఉదయం గణపతి పూజ, ఆవాహిత దేవతారాధన, అగ్ని మథనం అగ్ని ప్రతిష్ఠ, హోమాలు నిర్వహించారు.

నగరేశ్వరాలయంలో చండీయాగం



చండీయాగాన్ని నిర్వహిస్తున్న పురోహితులు

కొడంగల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో శనివారం చండీయాగం నిర్వహించారు. మూడు రోజులు కొనసాగనున్న పూజల్లో గణేశ, రుద్ర సహిత, శాంతి పూజలు నిర్వహించారు. భక్తులు యాగంలో పెద్దఎత్తున పాల్గొన్నారు. కామారెడ్డికి చెందిన గరికపాటి ఆంజనేయశర్మ, సంపత్‌శర్మ, భీమ్‌సేన్ వర్మ, శివప్రసాద్ శర్మ, శరత్‌శర్మ, భరద్వాజ శర్మ, సోమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యానగర్‌లో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠా



ప్రతిష్ఠించిన నవగ్రహ విగ్రహాలు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దివ్యానగర్‌లోని 'హనుమత్ శివపంచాయతన ఆలయం'లో నవగ్రహాల ప్రతిష్ఠాపన శనివారం నిర్వహించారు. హైదరాబాద్ రాంనగర్ ప్రాంతానికి చెందిన ఈటల శ్రీనివాస్ నవగ్రహ విగ్రహాలను అందజేయగా.. శుక్రవారం అంకురార్పణ చేశారు. శనివారం మంత్రోచ్ఛరణల మధ్య నవగ్రహాల ప్రతిష్ఠాపన పూర్తయిందని బొబ్బాల అశోక్‌రెడ్డి వెల్లడించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగిందని, పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

యాచారం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బా హాస్టల్‌లో ఇంటర్మీడియట్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ప్రత్యేకాధికారి అరుణశ్రీ శనివారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంఎల్‌టీ(వొకేషనల్) కోర్సు ప్రారంభిస్తున్నామని, 40 సీట్లకు విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 8331833426 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

తాండూరుకు పల్నాడు వచ్చేనా?

- వికారాబాద్‌లో గంటల తరబడి హాల్టింగ్
- తాండూరు వరకు పొడిగించాలని డిమాండ్



తాండూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి):వికారాబాద్ జంక్షన్ వరకు వస్తున్న పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైలును తాండూరు వరకు ఎప్పుడు పొడిగిస్తారని ఇక్కడి ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రజా ప్రతినిధులకు, రైల్వే శాఖ అధికారులకు ప్రయాణికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎన్నోసార్లు విన్నవించారు. వికారాబాద్ జంక్షన్‌లో గంటలపాటు నిలుస్తున్న పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ను తాండూరు వరకూ పొడిగించేలా చూడాలని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి విజ్ఞప్తి చేసినా అమలుకు నోచుకోవడం లేదని వాపోతున్నారు.

మూడున్నర గంటలు వికారాబాద్‌లోనే..

పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైలును తాండూరు వరకు పొడిగిస్తే తాండూరు ప్రాంత ప్రయాణికులు విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్‌లకు వెళ్లేందుకు మధ్యాహ్న వేళ సౌకర్యవంతంగా ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం ఈ రైలు వికారాబాద్‌కు ఉదయం 11గంటలకు చేరుకొని మధ్యాహ్నం 2:45గంటలకు వికారాబాద్ నుంచి పల్నాడుకు బయలుదేరుతోంది. మూడున్నర గంటలపాటు వికారాబాద్ స్టేషన్‌లోనే నిలుస్తోంది. 40 నిమిషాల సమయం పట్టే తాండూరు వరకు ఈ రైలును పొడిగిస్తే మధ్యాహ్నం 2గంటలకు తాండూరు నుంచి బయలుదేరినా అదే సమయానికి వికారాబాద్ చేరుకుంటుంది. దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు ఈ విషయంలో శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

పేదల సంక్షేమానికి పథకాల అమలు

దోమ, జూన్ 7(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం పేదల సంక్షేమానికి పథకాలను అమలుచేస్తోందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో శనివారం మూడు నెలల బియ్యం పంపిణీని ప్రారంభించారు. వర్షాకాలం నేపథ్యంలో మూడునెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.



బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

బొమ్మను చేసి.. ప్రాణం పోసి

ఆధునికతతో విగ్రహాల తయారీ

స్వయం ఉపాధిలో రాణిస్తున్న గుండప్ప

కస్తూర్‌పల్లి వాసి నైపుణ్యంపై ప్రత్యేక కథనం



కొడంగల్ రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గుండప్ప పూర్వీకుల కులవృత్తి కుండలు చేయడం. చిన్నప్పటి నుంచే ఆయన కుండల తయారీలో తల్లిదండ్రులతో పనిచేస్తూ కుండలు, విగ్రహాల తయారీని నేర్చుకున్నాడు. కాలానుగుణంగా వినూత్నంగా విగ్రహాలను తయారు చేస్తున్నాడు. వరి గడ్డి, కర్రలతో విగ్రహాలను చేస్తూ నేడు స్టీలు, సిమెంట్‌తో అందమైన విగ్రహాలను తయారు చేస్తున్నాడు. ఫొటోను చూపి విగ్రహాన్ని తయారు చేయమని ఎవరైనా అడిగితే అచ్చుగుద్దినట్లు సిమెంట్‌తో విగ్రహ తయారీలో గుండప్ప నేర్పరి. పండగల సమయాల్లో మట్టి వినాయకుడు, సరస్వతీదేవి, కాళికాదేవి, దుర్గామాత తదితర దేవతావిగ్రహాలను తయారుచేసి విక్రయిన్నాడు. దీంతో పాటు ఛత్రపతి శివాజీ, అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి, మహాత్మాగాంధీ లాంటి దేశ నాయకుల, పక్షులు, జంతువుల విగ్రహాలను చేస్తాడు. అలాగే అమరుల ఫొటోలను చూసి విగ్రహాలను తయారు చేసి ఆర్డర్‌పై పంపిస్తున్నట్లు గుండప్ప 'ఆంధ్రజోతి'కి వివరించాడు.

బ్యాంకులు రుణ సాయం చేయాలి



ప్రభుత్వ పరంగా బ్యాంకుల్లో రుణసాయం అందడంలేదు. నాకు రుణం ఇస్తే ఆధునిక యంత్ర పరికరాలతో మరింతగా ఆధునికత ఉట్టిపడేలా విగ్రహాలను చేస్తా. నలుగురికి ఉపాధి కల్పించి ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం లభిస్తుంది. మాది నిరుపేద కుటుంబం. పూర్వీకుల నుంచి కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న. ప్రభుత్వం సాయమందించి ఆదుకోవాలి.

- కె.గుండప్ప, విగ్రహాల తయారీదారు, కస్తూర్‌పల్లి

లూజ్‌గా విత్తనాలు విక్రయిస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న ఏవో రవినాథ్

యాచారం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎరువులు విత్తనాలు లూజ్‌గా విక్రయించొద్దని, ప్యాకెట్లను పూర్తిగా విక్రయించాలని ఏవో రవినాథ్ అన్నారు. శనివారం యాచారంలో ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడారు. నాణ్యమైన విత్తనాలే కొనాలని రైతులను కోరారు. లైసెన్స్ లేని దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు తీసుకోవద్దన్నారు. వాటికి రసీదు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు, ఎరువులు అమ్మే వారి వద్ద కొనొద్దన్నారు.ఎవరైనా డబ్బు ముందుగా తీసుకుంటూ విత్తనాలు విక్రయిస్తే తమకు సమాచారమందించాలని రైతులను కోరారు. హెచ్‌టీ, బీజీ-11,బీటీ -11పత్తి విత్తనాలు కొనొద్దని సూచించారు.

గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల్లో రాణించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పాపిరెడ్డిగూడలో శనివారం మైత్రీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే తొందరగా గుర్తింపు లభిస్తుందని తెలిపారు. యువకులు సమయాన్ని వృథా చేయకుండా ఏదో ఒక క్రీడను ఎంచుకొని రాణించేందుకు కృషి చేయాలన్నారు. విద్య, ఉద్యోగాల్లో క్రీడాకారుల కోటా ఉంటుందని, ఇది యువత భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని చెప్పారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

పాపిరెడ్డిగూడలో రూ.15లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. జెడ్పీ, ఎస్‌డీఎఫ్‌లతో భవనం నిర్మించామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఉదయ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దివ్యాసింగ్, మాజీ జెడ్పీటీసీ టి.విశాలరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, లేడీ వింగ్ అధ్యక్షురాలు రాణి, యూత్/బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్, జగదీశ్వరప్ప, నాయకులుభాస్కర్‌గౌడ్, కరుణాకర్, శ్రీధర్‌రెడ్డి, నర్సింలు, లక్ష్మయ్య, సుందరయ్య, గిరిధర్, రూప్లా, పెంటయ్య,ప్రకాశ్ గౌడ్, కర్ణాకర్‌రెడ్డి రామచందర్ పాల్గొన్నారు.



యాదయ్య మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న తీగల కృష్ణారెడ్డి

కూతురిని విదేశాలకు పంపే పనుల్లో ఉన్న తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి



యాదయ్య(ఫైల్)

కందుకూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువుల కోసం తన కూతురిని రెండు రోజుల్లో లండన్‌కు పంపాలన్న తాపత్రయంలో ఉన్న తండ్రి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన సంఘటన అన్నోజిగూడలో చోటుచేసుకుంది. అన్నోజిగూడకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొరైంకల యాదయ్య(53) శుక్రవారం ఉదయం బాలాపురం పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురై, చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఆయన తన కూతురు రాజేశ్వరిని ఉన్నత చదువులకు విదేశాలకు పంపే పనుల్లో భాగంగా కొన్ని రోజులుగా వీసా కోసం వెళ్లడం, డబ్బుల సర్దుబాటు వాటి గురించి తిరుగుతున్నాడు. ఉన్నట్టుండి యాక్సిడెంట్‌లో తండ్రి మృతితో కూతురు, కుమారుడు, భార్య గుండెలవిసేలా రోదిస్తున్నారు. యాదయ్య అంత్యక్రియలు శనివారం అన్నోజిగూడలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జిల్లా మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, పీసీసీ సభ్యులు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ బి.జంగారెడ్డి, ప్యాక్స్ మాజీచైర్మన్ మల్లేష్ నాయకులు కె.సాందురంగారెడ్డి, కె.సదానంద్‌గౌడ్ హాజరయ్యారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. యాదయ్య పార్టీలో చురుగ్గా పనిచేస్తూ ప్రజాసమస్యలపై పాటుపడేవాడని గుర్తు చేశారు. యాదయ్య భార్య అనురాధ, కుమారుడు, కూతురిని ఓదార్చారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

- కారులోని ముగ్గురిపై దాడి.. కారు అద్దాలు ధ్వంసం
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు, కేసు నమోదు



యువకుల దాడిలో పగిలిన కారు అద్దాలు

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో కొందరు యువకులు వీరంగం సృష్టించారు. రోడ్డుపై బైక్ నిలిపి హంగామా చేశారు. ఇదేమని ప్రశ్నించిన ముగ్గురిపై ఆ యువకులు దాడి చేసి.. కారు అందాలను పగలగొట్టారు. ఈ ఘటన చేవెళ్ల మండలం ఊరెళ్లలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీస్‌స్టేషన్‌లో బాధితుడిచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. చేవెళ్లకు చెందిన షఫియొద్దీన్, అతడి పెద్ద కుమారుడు తఖియొద్దీన్, స్నేహితుడు హుస్సేన్ కలిసి బక్రీద్ పండుగకు గొర్రెలు కొనేందుకు శుక్రవారం రాత్రి కారులో ఎనికెపల్లికి వెళుతున్నారు. ఊరెళ్ల మీదుగా ఎనికెపల్లి వెళ్లే క్రమంలో.. ఊరెళ్లలో గ్రామానికి చెందిన గూడెపు శ్రీను, కిరణ్, మరో ఐదుగురు యువకులు తప్పతాగి రోడ్డుపై బైక్ నిలిపారు. హారన్ కొట్టినా.. యువకులు పక్కకు జరగలేదు. కారులో నుంచి దిగి బైక్‌ను పక్కకు తీయాల్సిందిగా అడిగారు. మేం బైక్ తీయం.. ఏం చేస్తారు? అని యువకులు గొడవపెట్టుకున్నారు. పీకల దాకా మద్యం తాగిన ఆ యువకులు కారులోని ముగ్గురిపై దాడి చేశారు. రాళ్లు పట్టుకుని కారుపైకి ఎక్కి చంపుతామని బెదించారు. రాళ్లతో కారు అద్దాలు పగలకొట్టారు. యువకుల దాడిలో కారులోని ముగ్గురూ గాయపడ్డారు. గ్రామస్తులు చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. తమపై అకారణంగా దాడిచేసిన యువకులపై చర్యలు తీసుకోవాలని షఫియొద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైమ్ నంబర్ 386/2025 ప్రకారం 126(2), 118(1), 324(4), 351(2), 35(2) సెక్షన్ల కింద యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మృతుడి కుటుంబీకులకు చీఫ్ విప్ పరామర్శ



పెద్దేముల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కందనెల్లిలో రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన మాజీ వీఆర్‌వో అంపల్లి పురుషోత్తం కుటుంబ సభ్యులను శనివారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పి.మహేందర్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. అధైర్యపడకుండా ముందుకు సాగాలని వారికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట కరణం పురుషోత్తం రావు, మాజీ సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, లియాఖత్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు టీటీపీవోసీ ఉద్యోగాలు కల్పించాలి



ఎంపీ ఈటలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీటీపీవో ప్రతినిధులు

శంషాబాద్ రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ కన్సార్టియం(టీటీపీవోసీ) గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషిచేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. రెండు రోజులుగా మున్సిపల్ పరిధిలోని ఓ రిసార్ట్‌లో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎంపీ మాట్లాడుతూ... టీటీపీవోసీతో గతంలో ఎంతో మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. దీనిని మరింత విస్తరించాలని సూచించారు. పలు ఇంజినీరింగ్ కళాశాలు, డిగ్రీ విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు. నిరుద్యోగ యువత ఉన్నత చదువులు చదివి ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉన్నారని, అలాంటి వారికి ఇది చక్కని వేదిక కానుందని చెప్పారు. టీటీపీవోసీలో శిక్షణ తీసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. బ్లాక్ బాక్స్ కంపెనీ సీఈవో అనురాధ మాట్లాడుతూ... దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 100 హెచ్‌ఆర్‌లు, వివిధ కంపెనీలకు చెందిన 175మంది ప్రతినిధులు పాల్గొన్నారని, దీనిని యువత ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ వేదిక ద్వారా వర్క్‌షాప్‌లు చేశామన్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులు స్కిల్స్ పెంచుకునేందుకు ఉపయోపడుతుందని టీటీపీవో ప్రెసిడెంట్ విజయ్‌షైర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బెర్త్ దొరికేనా?



(ఐదో పేజీ తరువాయి)

చోటు లభించగా కాంగ్రెస్ ప్రభుత్వంలో మూడు జిల్లాల్లో ఒక్కరికీ మంత్రి పదవి దక్కలేదు. ఇపుడు జరిగే ఈ విస్తరణపై ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్లు ఆశలు పెట్టుకున్నారు. వీరికి మద్దతుగా మాజీ హోం మంత్రి, సీనియర్ నేత జానారెడ్డి అధిష్ఠానానికి లేఖ రాశారు. మంత్రివర్గంలో స్థానానికి యత్నిస్తున్న ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆశలకు ఆ లేఖ ఊపిరిపోసింది. రాజకీయంగా కీలకమైన ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి మంత్రివర్గంలో ఒక్కరికైనా స్థానం కల్పించకపోవడం మంచిది కాదని, మంత్రివర్గ విస్తరణలో ఈ జిల్లాల వారికి ప్రాధాన్యం కల్పించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ అప్పట్లో రాజకీయంగా కలకలం రేకెత్తించింది. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకునేందుకే జానారెడ్డి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా నేతలకు వంతపాడుతున్నారని బహిరంగంగానే విమర్శించారు.

నలుగురు గ్రామీణ ప్రాంతాల నుంచే..

వాస్తవానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా (పాత రంగారెడ్డి జిల్లా)లో కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన నలుగురు ఎమ్మెల్యేలూ గ్రామీణ ప్రాంతాల నుంచే గెల్చారు. వికారాబాద్ ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్ స్పీకర్ పదవిలో కొనసాగుతున్నారు. పరిగి నుంచి టి.రామ్మోహన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం నుంచి మల్‌రెడ్డి గెలిచి మంత్రివర్గంలో స్థానాన్ని ఆశిస్తున్నారు. అందరి కంటే సీనియర్ అయినందున తనకు అవకాశమివ్వాలని మల్‌రెడ్డి కోరుతున్నారు. ఆయన పలుమార్లు ఢిల్లీ వెళ్లి పార్టీ పెద్దలను కలిశారు. మండలిలో చీఫ్ విప్, మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలు యాదయ్య, ప్రకాశ్‌గౌడ్ కూడా మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇప్పటికే పార్టీ ఫిరాయింపులపై కోర్టుల్లో వివాదాలు కొనసాగుతుండడం మహేందర్‌రెడ్డికి ప్రతిబంధకంగా మారింది. మరో వైపు ఉమ్మడి జిల్లా నుంచి రెడ్డి సామాజికవర్గానికి మంత్రివర్గంలో ఛాన్స్ దాదాపు లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అనూహ్యంగా ప్రసాద్‌కుమార్ పేరు

మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ రాగానే సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ అగ్రనాయకత్వం సూచనలతో జాబితాను రూపొందించి మంత్రివర్గ విస్తరణకు సిద్ధమయ్యారు. ఆదివారం మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలున్నట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది. కడపటి సమాచారం మేరకు ఉమ్మడి జిల్లా నుంచి పలువురు మంత్రివర్గంలో స్థానం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నా ఇక్కడి నేతలకు అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అనూహ్యంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ పేరు శనివారం తెరపైకి వచ్చింది. స్పీకర్ పదవిపై ఆయన ఆసక్తి కనబరచడం లేదని, మంత్రిపదవి కోరుతున్నట్లు కొద్ది రోజులుగా ప్రచారం సాగుతోంది. వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరగనున్న నేపథ్యంలో ప్రసాద్‌కుమార్ అప్రమత్తమయ్యారు. స్పీకర్ పదవి తరువాత ప్రజలకు తాను దూరమైనట్లు భావిస్తున్నారు. ఇలానే కొనసాగితే వచ్చే ఎన్నికల్లో ఇబ్బందులొస్తాయని రాజకీయంగా తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని సన్నిహితుల వద్ద ఆయన ప్రస్తావిస్తున్నట్లు తెలిసింది. మంత్రివర్గంలోకొస్తే రాజకీయంగా పట్టు సాధించొచ్చని చెబుతున్నారు. నియోజకవర్గ పునర్విభజనలో ప్రస్తుతం ఉన్న నియోజకవర్గ సరిహద్దులు కొంచెం అటూ ఇటూ మారినా మంత్రిగా ఉంటే పెద్దగా రాజకీయ నష్టం లేకుండా చూసుకోవచ్చని భావిస్తున్నారు.

కులాల మధ్య సమతుల్యత ఉండేలా..

ఇటీవల ఎస్సీ వర్గీకరణ జరిగిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణపైనా దీని ప్రభావం నెలకొంది. మాదిగ సామాజికవర్గం నేతలు మంత్రివర్గంలో తమకు అవకాశమివ్వాలని అధినాయకత్వంపై వొత్తిడి పెంచుతున్నారు. ఈ మేరకు ఢిల్లీ కూడా వెళ్లి పార్టీ పెద్దలందరినీ కలిశారు. దీంతో కేబినెట్‌లో ఎస్సీ కులాల మధ్య సమతుల్యత కల్పించడం అధినాయకత్వానికి కత్తిమీద సాములా మారింది. మరో వైపు రెడ్డి సామాజిక వర్గం నుంచి కూడా తీవ్ర వొత్తిళ్లు ఎదురవుతున్నాయి. మంత్రివర్గంలో సామాజిక సమతూకం పాటించడం పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను మంత్రివర్గంలో తీసుకువస్తే కొన్ని రాజకీయ ఇబ్బందులు తొలుగుతాయని పార్టీ భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రసాద్‌కుమార్ గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉండడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న సన్నిహిత సంబంధాల వల్ల ఆయనకు పదవి దక్కవచ్చనే ప్రచారం జోరుగా సాగుతోంది.


పరిగి: బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


వికారాబాద్: ఆలంపల్లి ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

తాండూరు: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి →



ఘనంగా బక్రీద్ వేడుకలు

వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో శనివారం బక్రీద్ (ఈద్ ఉల్ అదా) పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మసీద్‌ల నుంచి ర్యాలీగా ఈద్గాకు చేరుకుని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలు బక్రీద్ పండగ విశిష్టతను వివరించారు. త్యాగాలకు ప్రతీకగా జరుపుకునే పండగ సందర్భంగా గ్రామాల్లో ముస్లింలు ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూన్ 7


వికారాబాద్‌లో..


పూడూరు: కెరవెల్లిలో నమాజ్ అనంతరం ముస్లింలు


కులకచర్ల: ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు


దుద్యాల్: పోలెపల్లిలో బక్రీద్ వేడుకల్లో ముస్లింలు


మర్పల్లి: బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు


పోచారం మున్సిపాలిటీ నారపల్లిలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు


కొడంగల్: ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు


ఘట్‌కేసర్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు


కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్


దౌల్తాబాద్: బక్రీద్ విశిష్టతను వివరిస్తున్న మతపెద్ద


కొడంగల్: రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డితో ముస్లింలు


పెద్దేముల్: మంబాపూర్ గ్రామంలో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ సర్పంచ్


ధారూరు: నాగారం ఈద్గా వద్ద శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు


పరిగిలో ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


చందు చారి (ఫైల్)

దుద్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన దుద్యాల మండలంలో జరిగింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన కమ్మరి జగన్నాథం, సరిత దంపతుల కుమారుడు కమ్మరి చందుచారి(19) ఇంటర్ వరకు చదివి హైదరాబాద్‌లో సంవత్సర కాలంగా పురోహితుడిగా శిక్షణ పొందుతున్నాడు. శుక్రవారం నల్గొండకు చెందిన స్నేహితుడు శివకుమార్‌తో కలిసి బైక్‌పై దైవదర్శనం నిమిత్తం తిరుపతికి వెళ్లాడు. ఈక్రమంలో శనివారం మార్గమధ్యలో రేణిగుంట దగ్గర రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఘటనలో యువకుడు చందుచారి అక్కడికక్కడే మృతిచెందాడు. స్నేహితుడు శివకుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య


సుమన్(ఫైల్)

తాండూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలు తాళలేక ఓ యువకుడు జీవితంపై విరక్తిచెంది రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం తాండూరు పట్టణం ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన సుమన్(24) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. గుర్తుతెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో మల్కాపూర్ గ్రామానికి చెందిన సుమన్‌గా రైల్వేపోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్‌ఐ అనిత

ధారూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి శనివారం బాధితులకు అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోగొట్టుకున్న మూడు సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించినట్లు ఎస్‌ఐ అనిత తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం


సిద్దనొంపు ఆలయంలో పూజల్లో భక్తులు

కొడంగల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం 89వ వారం పూర్తయిన సందర్భంగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, హిందూ వాహిని సభ్యులు పాల్గొన్నారు.

పెద్దేముల్ ఎస్‌ఐగా ప్రశాంత్‌వర్ధన్



పెద్దేముల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ ఎస్‌ఐగా ప్రశాంత్‌వర్ధన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తన వ్యక్తిగత కారణాలతో ఇక్కడి నుంచి బదిలీ చేసుకుని వెళ్లిపోవడంతో ప్రశాంత్‌వర్ధన్‌ను పెద్దేముల్ ఎస్‌ఐగా ప్రభుత్వం నియమించింది. ఈయన వికారాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జిగా పనిచేశారు. బదిలీలో భాగంగా పెద్దేముల్ ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకున్నారు.

కోట్‌పల్లి ఎస్‌ఐగా శైలజ



వికారాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌ఐగా ఎం.శైలజ శనివారం బాధ్యతలు చేపట్టారు. కోట్‌పల్లి పీఎస్‌లో పనిచేసిన ఎస్‌ఐ గఫర్ వికారాబాద్‌కు బదిలీ కాగా, వికారాబాద్ డీఆర్సీబీలో పనిచేస్తున్న శైలజ గఫర్ స్థానంలో బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ప్రజలు సహకరించాలన్నారు. సమస్యలు ఏమున్నా నేరుగా తమ దృష్టికి తేవాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

ఉత్తమ సేవలకు సన్మానం


అధికారులను సన్మానిస్తున్న నాయకులు

చౌడాపూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అవతరణ వేడుకల సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి ప్రశంసలు పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కార్యదర్శి రాజిరెడ్డితో పాటు ఎంఈవో రాంచందర్‌ను శనివారం చౌడాపూర్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బ్యాగరి శ్రీనివాసులు, అశోక్, రాజశేఖర్, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

హైవే పనులకు బ్రేక్!

(ఐదో పేజీ తరువాయి)

ప్రారంభించారు. కిలో మీటర్ వరకు కొంతమేర పనులు చేసి అసంపూర్తిగా వదిలేశాడు. అల్లాపూర్ - రాంపూర్ గేటు వరకు ఒక సైడ్ కంకర వేసి ఎత్తు పెంచి మట్టి పోసి వదిలేశారు. ఎగుడు, దిగుడు రోడ్డుతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టులు

సిరిగిరిపేట్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. రోడ్డు నిర్మాణానికి ముందు కల్వర్టులు తవ్వి సెంట్రింగ్ అల్లి వదిలేశారు. దీంతో రాత్రివేళలో వాహనదారులు ఈ కల్వర్టులో పడే ప్రమాదముంది. అలాగే ఈ రోడ్డుపై దుమ్ము రేగుతుండడంతో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కింద పడిపోతున్నారు. తాండూరు మండలం మల్కాపూర్, ఓగిపూర్, సిరిగిరిపేట్, కొత్లాపూర్, కోటబాస్పల్లి లోని నాపరాయి లారీలు, మల్కాపూర్, బెల్కటూర్, సంగెం కలాన్ గ్రామ శివారుల్లో సిమెంట్ కర్మాగారాలు, అధిక లోడ్‌తో లారీలు ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తాయి. ఒక్క కిలోమీటర్ కూడా రోడ్డు పనులు పూర్తి కాలేదు. జినుగుర్తి గేటు నుంచి కొత్లాపూర్ వరకు ఇంకా పనులు ప్రారంభం కాని దుస్థితి.

తాండూరు- కొడంగల్ రోడ్డులో..

తాండూరు - కొడంగల్ రోడ్డు 18 కిలో మీటర్లు ఉంటుంది. తాండూరు నియోజకవర్గ పరిధిలోకి 12 కిలో మీటర్లు వస్తుంది. ఈ రోడ్డు పనులు మూడు అడుగులు ముందుకు, ఆరడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతున్నాయి. కోడంగల్ పరిధిలోకి వచ్చే కొంత దూరం రోడ్డేశారు. కాగ్నా వాగు నుంచి పనులు ప్రారంభం కాగా లక్ష్మీనారాయణపూర్, దౌలాపూర్, తిమ్మాయిపల్లి, ఎర్రన్‌పల్లి గ్రామాల ప్రజలు ఈ రోడ్డు పనులు అంసపూర్తిగా ఉండడంతో కష్టలు పడుతున్నారు. నెలల తరబడి రోడ్డు పక్కనే కంకర, మట్టి వేయడంతో అర గంటలో కోడంగల్‌కు వెళ్లే వాహనాలకు గంట సమయం పడుతోంది. కాగ్నా వాగు నుంచి లక్ష్మీనారాయణపూర్ వరకు రోడ్డుపై కంకర, మట్టి వేసి వదిలేశారు. అర కిలోమీటర్ వరకు వెళ్లాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. బూత్‌పూర్ నేషనల్ హైవేకు ఇది లింకు హైవే. ఈ రోడ్డు వెంబడి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల పలు కార్లు, బైక్‌లు ఈ రోడ్డు మార్గంలో నిర్మించేందుకు తవ్వి వదిలేసిన కల్వర్టులో పడిపోవడంతో పలువురికి గాయాలయ్యాయి.


దుమ్ము ధూళి లేస్తున్న రోడ్డు

అసెంబ్లీలో ప్రస్తావించినా..

గత అసెంబ్లీ సమావేశాల్లో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తాండూరు మీదుగా జరుగుతున్న జాతీయ రహదారి పనులు నత్తనడకన నడుస్తున్నాయని, పనులను వేగవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరి రెండు నెలలు గడుస్తున్నా పనులు నిదానంగా సాగుతున్నాయి. ఈ విషయాన్ని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయినా కాంట్రాక్టర్ పనుల్లో వేగం పెంచడం లేదు.

అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే


అనంతపద్మనాభ స్వామిని దర్శించుకుంటున్న రోహిత్‌రెడ్డి

వికారాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం అనంతగిరి అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. వికారాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నిఖిల్, కిషోర్, టైగర్ కృష్ణయ్య, కృష్ణ ఆధ్వర్యంలో అనంత పద్మనాభస్వామి ఆలయంలో జన్మదిన వేడుకలు జరుపుకోగా, పూజారులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు విజయ్‌కుమార్, ప్రభాకర్, స్టాలిన్ తేజ, బాలవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. రోహిత్‌రెడ్డి అభిమానులు పెద్దఎత్తున హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తాండూరు: తాండూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు రోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం తన నివాసంలో కార్యకర్తల మధ్య జరుపుకున్నారు. అనంతరం కార్యకర్తలు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యకర్తలు గజమాలతో రోహిత్‌రెడ్డిని సన్మానించారు. బక్రీద్ వేడుకల్లో పాల్గొనగా అక్కడ శాసనమండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బషీరాబాద్: మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం తాండూరులోని నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ఇందర్‌చెడ్ నర్సిరెడ్డి నేతృత్వంలో సొసైటీ డైరెక్టర్ అశోక్‌గౌతం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌గౌడ్, సుదర్శన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తాండూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మల్కాపూర్ గ్రామానికి చెందిన వాగ్మోడే సుమన్ ప్రమాదవశాత్తు రైలు ప్రమాదంలో మృతిచెందాడు. మృతదేహాన్ని తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ బీసీసెల్ మండల అధ్యక్షుడు ఆర్సీ గౌడ్ తాండూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. సుమన్ అంత్యక్రియలకు రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన వెంట గ్రామ గని కార్మిక సంఘం అధ్యక్షుడు ఎస్.పండరి, గ్రామపెద్దలు, యువ నయకులు, ఆర్సీగౌడ్ యువసేనా సభ్యులు కశీనాథ్, చిరంజీవి పాల్గొన్నారు.


మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నిరుపయోగంగా 'డబుల్' ఇళ్లు


బొర్రా హేమ్యనాయక్ తండా పరిధిలో నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

కులకచర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి వెంకటాపూర్ బొర్ర హేయ్యనాయక్ తండా పరిధిలో గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 8 సంవత్సరాల కిందట బొర్రా హేమ్యనాయక్ తండా పరిధిలో 30 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించారు. ఈ ఇళ్లను ఎవ్వరికీ కేటాయించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. వాటి పర్యవేక్షణ లేక పశువుల పాకలుగా మారుతున్నాయి. తండా పరిధిలో ఇల్లు లేని గిరిజన కుటుంబాలు చాలా ఉన్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసేందుకు కమిటీ వేసింది. ఇందిరమ్మ ఇళ్లకు బదులు తండాలో ఇల్లు లేని గిరిజన కుటుంబాలను గుర్తించి నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్లు లేని వారికి కేటాయించాలి



తండాపరిధిలో, చుట్టూ తండాల్లో ఇళ్లు లేని గిరిజన కుటుంబాలను గుర్తించి వారికి నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి. ఎవ్వరికి కేటాయించకపోవడంతో శిథిలావస్థలో ఉన్నాయి. అధికారులు స్పందించి ఇళ్లు లేని వారికి కేటాయించాలి.

- గోవింద్ నాయక్, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు

ఒంటెత్తు పోకడ మానుకోవాలి

కీసర, జూన్ 7(ఆంధ్రజ్యోతి): దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం అధికారులు ఒంటెత్తు పోకడ మానుకోవాలని కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి పేరుతో కీసర గ్రామాన్ని దమ్మాయిగూడ మున్సిపాలిటీలో విలీనం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే ఆరునెలలుగా కీసర గ్రామపంచాయతీ కార్యాలయాన్ని వార్డు కార్యాలయంగా మార్చుకొని స్థానిక ప్రజల సమస్యలు తీరుస్తున్న అధికారులు, ఉన్నఫళంగా కీసర వార్డు కార్యాలయాన్ని ఎత్తేసే పనుల్లో ఉన్నారని అన్నారు. వార్డు కార్యాలయం ఎత్తేస్తే దాదాపు 20వేల జనాభా ఉన్న కీసర వాసులు ప్రతీ పనికి దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు. ఇప్పటికైనా కీసర వార్డు కార్యాలయం ఎత్తేసే నిర్ణయాన్ని అధికారులు మానుకోవాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


నూతన కార్యవర్గ సభ్యులతో బీజేపీ నాయకులు

వికారాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్ అన్నారు. బీజేపీ వికారాబాద్ మండల కార్యవర్గ సమావేశం శనివారం స్థానిక శివాజీనగర్ కాలనీలో పార్టీ మండల అధ్యక్షుడు శివరాజ్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ బీజేపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. మోదీ 11ఏళ్లలో దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేశారని కొనియాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్ల నందు, అమరేందర్ రెడ్డి తదితరులు దిశానిర్దేశం చేశారు. అనంతరం మండల నూతన కమిటీ సభ్యులను ప్రకటించారు. ప్రధాన కార్యదర్శులుగా బేగరి గోపాల్, మష్టి శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా నరేష్, ప్రవీణ్, సూర్యప్రకాశ్ రెడ్డి, సురేందర్ రెడ్డి, కార్యదర్శులుగా మల్లేశ్, రాఘవేందర్‌రెడ్డి, లక్ష్మి, యాదగిరి, కోశాధికారిగా పరమేశ్ నియమితులయ్యారు.

బీజేపీ కీసర మండల కార్యవర్గం

కీసర: బీజేపీ కీసర మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కోల బాల్‌రాజ్ యాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రధాన కార్యదర్శులుగా నల్లా వెంకట్‌రెడ్డి, ఆబ్బబోయిన నాగరాజు, ఉపాధ్యక్షులుగా ఉట్కూరి పవన్‌గౌడ్, తోకటి దుర్గేష్, చిందం సంధ్యారాణి, కోల మహేందర్ యాదవ్, కార్యదర్శులుగా డొంకని శాలిని, పైళ్ల శ్రీనివాస్‌రెడ్డి, దేశం రాజేంద్రప్రసాద్, గడ్డం శ్రీనివాస్, కోశాధికారిగా తర్రే సత్యనారాయణలను ఎనుకున్నట్లు తెలిపారు. కార్యవర్గసభ్యులతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

ధారూరులో చిరుజల్లులు

ధారూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ధారూరుతో పాటు పరిసర గ్రామాల్లో శనివారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. సాయంత్రానికి ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు కురిసి వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు.

నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలి


ఎస్‌ఐ శంకర్

బషీరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ నేపథ్యంలో పంటలు సాగు చేసే రైతులు నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలని బషీరాబాద్ ఎస్‌ఐ పి.శంకర్ సూచించారు. ఎస్‌ఐ శనివారం విలేఖర్లతో మాట్లాడారు. విత్తనాల నాణ్యత విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తక్కువ ధరకు విత్తనాలు విక్రయిస్తున్నారని ఎవరైనా చెబితే నమ్మి మోసపోవద్దన్నారు.